

పోలీస్ ఫిట్‌నెస్

● ఖాకీల యోగాసనాలు

ప్రజాశక్తి - చిత్తూరుఅర్బన్
దొంగల్ని పట్టుకోవడం కోసం పోలీసులకు ఫిట్‌నెస్ ఎంతో ముఖ్యమని భావించిన జిల్లా ఎస్‌పి మణికంఠ చందోలు జిల్లాలో ఎంపిక చేసిన పోలీసులకు యోగా క్లాసులు నిర్వహించి ఫిట్‌నెస్ పెంచేందుకు వారం రోజుల పాటు జిల్లా కేంద్రమైన చిత్తూరులోని పోలీస్ ట్రైనింగ్ కేంద్రంలో యోగా శిక్షణ ఇచ్చారు. ఈ శిక్షణా తరగతులు గతనెల 25వ తేది నుండీ 30వ తేది వరకు జిల్లాలోని 38 మందికి యోగా శిక్షణ ఇచ్చారు. డీజీపి ఆదేశాల మేరకు జిల్లా ఎస్పీ ప్రతి పోలీస్‌స్టేషన్ నుండీ ఒక్కర్ని ఈ శిక్షణ కోసం ఎంపిక చేశారు. ఇలా ఎంపిక చేసిన వారికి శివానంద పిరమిడ్ ధ్యాన కేంద్రం సహకారంతో యోగాసనాలు, ప్రాణయామం, ధ్యానం, ఒత్తిడి నిర్వహణ, ఆరోగ్య ఆర్థిక సలహాలు, నైతిక విలువలపై శిక్షణ అందించడం ద్వారా వారి వ్యక్తిగత వత్తిపర జీవితాలను మెరుగుపరచడమే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశ్యం.

పోలీసు సిబ్బంది ఆరోగ్యం, మానసికస్థితి మెరుగుపడితే వారు ప్రజలకు మరింత ప్రభావవంతమైన సేవలను అందించగలరు. యోగాసనాలు, ధ్యానం, ప్రాణాయామం శిక్షణ ఇచ్చారు. పోలీసు ఉద్యోగం అనేది అత్యంత ఒత్తిడితో కూడిన వృత్తి, నిత్యం తీవ్ర ఒత్తిడికి గురికావడం, ప్రమాదకర పరిస్థితులను ఎదుర్కోవడం, గంటలపాటు పనిచేయడం వంటి కారణాల వల్ల పోలీసు సిబ్బంది శారీరక మానసిక ఆరోగ్యం దెబ్బతింటుంది. యోగాలోని ఆసనాలు, శ్వాసవ్యాయామాలు (ప్రాణాయామం), ధ్యానం ద్వారా శరీరం, మనస్సు ప్రశాంతంగా మారుతుంది. యోగా చేయడం వలన ఒత్తిడిని తగ్గించడం, శారీరక, మానసిక ఆరోగ్యాన్ని మెరుగుపరచడం, పని సామర్థ్యాన్ని పెంచడంలో కీలకపాత్ర పోషిస్తుంది. నిత్య జీవితంలో యోగా సాధన చేసుకుంటూ వెళితే, పోలీసులు ఆరోగ్యకరమైన, ప్రశాంతమైన జీవన విధానాన్ని పొందవచ్చుని పోలీస్‌లకు ప్రత్యేక యోగా శిక్షణ ఇచ్చింది.

శిక్షణలో భాగంగా ప్రత్యేక అంశాలు:
యోగాసనాలు (39):
ఈ ప్రత్యేక శిక్షణా కార్యక్రమంలో శారీరక దృఢత్వాన్ని పెంపొందించడమే ప్రధాన లక్ష్యంగా నిలిచింది. పోలీసు సిబ్బంది రోజువారీ విధులు నిర్వర్తించడంలో ఎదురయ్యే శారీరక కష్టాలను తగ్గించడమే కాకుండా, ఆరోగ్యాన్ని మెరుగుపరచడానికి 39రకాల విభిన్న యోగాసనాలను వివరించడంతో పాటు, వాటిని ఆచరించే విధానాన్ని గోవిందరాజులు ఎఆర్ హెడ్‌కానిస్టేబుల్ నేర్పించారు. ప్రాణాయామంపై ఢిల్లీబాబు, ధ్యానం రాజు, రేవతి, ఒత్తిడి నిర్వహణ డిటిసి ఇన్స్ట్రక్టర్ అమరనాధరెడ్డి, ఆరోగ్యం ఆర్తిక నిర్వహణ పోలీస్ యూనిట్ హాస్పిటల్ డాక్టర్ లావణ్య, వృత్తిపరమైన నీతి విలువలు అడిషనల్ ఎస్పీ ఏఆర్ శివనంద కిషోర్ శిక్షణ ఇచ్చారు. నిత్యం ఒత్తిడితో పని చేస్తున్న పోలీసులు అనేక ఆరోగ్య సమస్యలు ఎదుర్కొవడం చూస్తున్నాం. గుండే పోటు, ఇతర ఆరోగ్య సమస్యలతో పోలీస్‌శాఖలో విధులు నిర్వహిస్తున్న పోలీసులు అకాలమరణం పొందుతున్నారు. పోలీసుల్లో ఒత్తిడి తగ్గించేలా నిర్వహించిన వారం రోజుల యోగా శిక్షణా తరగతులు పోలీసుల మానసిక పరివర్తనలో మార్పు తీసుకురావడంతో పాటు ఆరోగ్యాన్ని పెంపొందిస్తాయని ఆశిద్దాం.


చిత్తూరు పోలీస్ ట్రైనింగ్ కేంద్రంలో యోగాసనాలు వేస్తున్న పోలీసులు

కొండెక్కిన ఉల్లి..వెల్లుల్లి..

● పెరిగిన నిత్యావసరాలు

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్:



పెరిగిన నిత్యావసరాలతో సామాన్య, మధ్యతరగతి ప్రజలకు ఇక్కట్లు తప్పడం లేదు. కూరగాయలతో పాటు అన్ని నిత్యావసర వస్తుల ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయి. ఉప్పు, పప్పు బియ్యం ఇలా ఒక్కటేమిటి అన్ని రకాల వస్తువులు అమాతంగా పెరిగిపోవడంతో రూ.500ల నోటు మార్చినా నాలుగు రకాల వస్తువులు కొనే పరిస్థితి లేదు. దీపావళి తరువాత నిత్యావసర వస్తువుల ధరలు తగ్గుతాయని ఆశించినా నిత్యావసరాల ధరలు తగ్గకపోవగా మరింతగా పెరిగాయి.

కొద్మెకి కూర్చు ఉల్లి.. వెల్లులి..
ఉల్లి రూ.60లు, వెల్లులి రూ. 480లు, టమోటా కిలో రూ.70లు, ఇక కూరగాయలు కిలో ఏది కొన్నాలన్నా రూ.50లుపై మాటే. బియ్యం మేలురకం 25 కేజీల బస్తా రూ.14 నుంచి 1500లు, కందిపప్పు కిలో రూ.160, వంటనూనెలు సన్‌ఫ్లవర్ ఆయిల్ కిలో రూ.150లు ఇలా పెరిగిన ధరలతో మధ్యతరగతి వారు కూడా ఏది కొనాలన్నా ఒకటి, రెండుసార్లు ఆలోచించాల్సి వస్తోంది. ఇక పేదలు, భవన నిర్మాణ కార్మికులు, ఆటో రిక్షా కార్మికులు, దినసరి కూలీల పరిస్థితి చెప్పనక్కర్లేదు. పెరిగిన నిత్యావసరాలతో పేదల వంటకాల్లో ఉల్లి, వెల్లులి వాడకం మానేశారనే చెప్పాలి. హోటల్స్‌ల్లో ఉల్లి, వెల్లుకి ప్రత్యామ్నాయంగా క్యాబేజీని వాడుతున్నారు.

స్థానిక కూరగాయాల మార్కెట్‌లో ధరలు ఇలా...
స్థానికి కూరగాయల మార్కెట్‌లో మంగళవారం కూరగాయల కిల్లోలో ధరలు ఇలా ఉన్నాయి. వంకాయ రూ.40లు, కాకార రూ.60, క్యాబేజి రూ.50, క్యారెట్ రూ.60, ముల్లంగి రూ.40, క్యాలీఫ్లవర్ రూ.60, ఉల్లి కిలో రూ.60, వెల్లులి కిలో రూ.480, బిన్సీ రూ. 45, బెండ రూ. 40, బిట్‌రోట్ రూ.35, కంద రూ.50లు కొత్తిమీర కట్ట ఒకటి పెద్దది రూ.60లు, ఆకు కూరలు కట్ట రూ.30 నుంచి 40లు ఉంది. టమోటా కిలో రూ.70లు అమ్ముతున్నారు. రోజురోజుకు పెరుగుతున్న నిత్యావసర వస్తువుల ధరలను ప్రభుత్వం నియంత్రించాలని ప్రజలు కోరుతున్నారు.

'ఫెంగల్'తో నిండిన ప్రాజెక్టులు



ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: ఫెంగల్ తుపాన్ తమిళనాడు పుదిచ్చేరి వద్ద బలహీనపడి అల్పపీడనంగా మారడంతో సోమ, మంగళవారం జిల్లావ్యాప్తంగా తేలికపాటి వర్షం కురిసింది. వాతావరణంలో చల్లబడి ఈదురు గాలులకు చలి తీవ్రత పెరగడంతో ఇంటి నుంచి బయటికి రావడానికి జనం ఇబ్బంది పడుతున్నారు. తుపాను ప్రభావం తగ్గినా చలితీవ్రత ఏమాత్రం తగ్గకపోవడంతో నిత్యావసరాలు కొనుగోలు కోసం బయటికి వచ్చేందుకు ఇబ్బందులు తప్పడం లేదు. తుపాను ప్రభావంతో జిల్లా వ్యాప్తంగా మూడు రోజుల పాటు ఎడతెరిపిలేని వర్షంతో జిల్లాలోని కృష్ణాపురం, ఎన్‌టిఆర్ జలాశయం పూర్తిస్థాయిలో నిండి జలకళ సంతరిచుకుంది. శనివారం ఎన్‌టిఆర్ జలాశయం ఇన్ ఫ్లో 100 క్యూసెకులు, అవుట్ ఫ్లో 100 ఉంటంతో రెండు గేట్లు ఎత్తి దిగువకు నీటిని విడుదల చేశారు. కృష్ణాపురం రిజర్వాయర్ ఇన్‌ఫ్లో 370 క్యూసెకులకు ఉండటంతో సోమవారం గేట్లు ఎత్తి జలవనరులశాఖ అధికారులు నీటిని దిగువకు విడుదల చేశారు. ఫెంగల్ తుపాన్ ప్రభావంతో జిల్లాలోని అన్ని మండలాల్లో వర్షపాతం నమోదు అయ్యింది. జిల్లాలోని 32 మండలాల్లో మూడు రోజుల పాటు 3073.4 మిలీమిటర్లు నమోదు కాగా అత్యధికంగా నింద్ర 169.2 మిలీమిటర్లు, అత్యల్పంగా చిత్తూరు రూరల్ మండలం 86.6గా నమోదు అయ్యింది. ఇక నవంబర్ 30వ తేదీ జిల్లా వ్యాప్తంగా 157.2, డిసెంబర్ ఒకటో తేది 1836.8, రెండో తేదీ 1079.4 మిలీమిటర్లుగా వర్షపాతం నమోదు అయ్యింది.

ప్రవహించే నీళ్లలోలో దిగకండి : ఎస్సై

వెదురుకుప్పం: మండలంలో సోమవారం రాత్రి కురిసిన భారీ వర్షానికి మారేపల్లి సమీపంలో గల మద్దెలవంకలో నీరు ఉధృతంగా ప్రవహిస్తోంది. దీంతో రాకపోకలు స్తంభించాయి. తిరుపతి, చిత్తూరుకి వెళ్లే ప్రధాన రహదారి ఇదే. పాఠశాలలకు వెళ్లే ఉపాధ్యాయులు, విద్యార్థుల పరిస్థితి వర్ణాణీతం. సంబంధిత శాఖ అధికారులు వెంటనే స్పందించి సహాయచర్యలు చేపట్టారు. ఎవరు అటువైపు వెళ్ళకుండా ఈవోపీఆర్‌టి పురుషోత్తం తన సిబ్బందితో, రెవెన్యూశాఖ అధికారులు, గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు. వెదురుకుప్పం ఎస్సై వెంకటసుబ్బయ్య మాట్లాడుతూ మద్దెమడుగు ప్రాజెక్టు నుంచి వచ్చే నీరు వల్ల మద్దెమాను వంక పరిసర ప్రాంతాలలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎలాంటి పరిస్థితులలో వంకలో దిగి సాహసాలు చేయరాదని వంక ఉధృతి తగ్గితే రాకపోకలు సాగించాలని సూచించారు. వంక ఉద్రిక్తి తగ్గేకొద్దీకి, రాకపోకలు సాఫీగా సాగాయని స్థానికులు తెలిపారు.


వెదురుకుప్పం

నీటి నిల్వలు లేకుండా.. సత్వర చర్యలు..

కమిషనర్ నరసింహ ప్రసాద్



ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: తుపాను వలన కురుస్తున్న వర్షాలు నేపథ్యంలో నగరంలో ఎక్కడా వర్షపునీరు నిల్వ చేరకుండా వేగంగా చర్యలు తీసుకోవాలని కమిషనర్ పి.నరసింహ ప్రసాద్ సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం ఉదయం కమిషనర్ నగరంలో పలు ప్రాంతాల్లో విస్తృతంగా పర్యటించి పారిశుద్ధ్య పనుల నిర్వహణ, వర్షం పరిస్థితులపై తనిఖీలు నిర్వహించారు. ఎమ్మెస్సార్ సర్కిల్ వద్ద కాలువలో వ్యర్థాలు పేరుకుపోవడంతో తొలగించాలని పారిశుద్ధ్య విభాగం అధికారులను ఆదేశించారు. కమిషనర్.. కుమార్ నగర్ కాలనీ, గిరింపేట, ఆనంద థియేటర్, హైరోడ్డు ప్రాంతాల్లో మురుగునీటి కాలువలను పరిశీలించారు. కాలువల్లో వర్షపునీటి ప్రవాహానికి ఆటంకాల లేకుండా ఎప్పటికప్పుడు వ్యర్థాలను తొలగించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. కమిషనర్ ఆదేశాలతో నగరపాలక ప్రజారోగ్య విభాగం అధికారులు నగరంలో వర్షపు నీరు నిలవకుండా ఎప్పటికప్పుడు కాలువలను శుభ్రం చేయించారు. కూలిన చెట్లను వేగంగా తొలగించి, పారిశుద్ధ్య పనులు చేపట్టారు.

నేషనల్ హైవే పై గుంతలు

- ప్రమాదాలకు గురవుతున్న వాహనాలు
- పట్టించుకోని అధికారులు



ప్రజాశక్తి - వి కోట: వి కోట.. పేర్నంబట్ ప్రధాన రహదారిలోని బంగ్లా ఊరు సమీపంలో జాతీయ రహదారిపై ఏర్పడిన గుంతలు ప్రమాదాలకు నిలయంగా మారుతోంది. గత కొద్ది సంవత్సరాల క్రితం రూ.148 కోట్లతో నిర్మించిన విల్లూపురం జాతీయ రహదారి నాణ్యతా లోపంతో బంగ్లా ఊరు సమీపంలో జాతీయ రహదారి మధ్యన గుంతలు ఏర్పడ్డాయి. వీకోట నుండి చెన్నైకు వెళ్లే ప్రధాన రహదారి కావడంతో నిత్యం వందలాది వాహనాలు ఈ మార్గం గుండా వెళ్తుంటాయి. గ్రామ సమీపంలోని దేవాలయం సమీపంలో రహదారి ఇరువైపులా ఏటవాలుగా ఉండడంతో వాహనాలు వేగంగా వచ్చి ఈగుంతలను గమనించకపోవడంతో వాహనాలు అదుపుతప్పి ప్రమాదాలకు గురవుతున్నాయి. మంగళవారం వీకోట వైపు నుండి చెన్నైకి వెళ్తున్న ఇన్నోవా వాహనం ఇదే చోట గుంతలను తప్పించే ప్రయత్నంలో అదుపుతప్పి ప్రమాదానికి గురి అయింది. వాహనంలోని డ్రైవర్ తీవ్రంగా గాయపడగా మరో ఇద్దరు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. ఇటువంటి ప్రమాదాలు లెక్కకు మించి జరుగుతున్నప్పటికీ అధికారులు మరమ్మతులు చేపట్టకపోవడం పట్ల గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి జాతీయ రహదారిపై ఏర్పడిన గుంతలు పూడ్చి ప్రమాదాలు అరికట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

సిసి రోడ్ల నిర్మాణాలను పూర్తి చేయండి : కలెక్టర్



ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: ఎంపి లాడ్స్ కింద జిల్లాకు అందిన నిధులను సకాలంలో ఖర్చు చేయాలని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ పేర్కొన్నారు. మంగళవారం జిల్లా సచివాలయంలోని సమావేశ మందిరంలో ఎంపి లాడ్స్ నిధుల వినియోగంపై సిపిఓ, పిఆర్, ఆర్‌డబ్ల్యూఎస్, ఇరిగేషన్‌శాఖల ఎస్‌ఈలు, ఈఈలు, మున్సిపల్ కమిషనర్లతో జిల్లా కలెక్టర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎంపి లాడ్స్ కింద 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి రూ.4.81కోట్ల అంచనా వ్యయంతో 88 పనులు మంజూరు కాగా రూ.73లక్షలతో 25 పనులు పూర్తై 13 పనులు పురోగతిలో ఉన్నాయని, పురోగతిలో ఉన్న పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని, ఇంకనూ ప్రారంభించని పనులను వెంటనే ప్రారంభించి పూర్తి చేయాలన్నారు. మంజూరైన పనులలో రూ.5లక్షల లోపు అంచనా వ్యయంతో ఉన్న పనులను డిసెంబర్ నెలాఖరు లోపు, రూ.5 లక్షల పై అంచనా కలిగిన పనులను మార్చి 2025 లోపు పూర్తి చేయాలన్నారు. చిత్తూరు, మదనపల్లె డివిజన్‌లకు సంబంధించి పిఆర్, ఆర్‌డబ్ల్యూఎస్, పిఐయు శాఖలలో ఇతర అభివృద్ధి పనులకు రూ.1.75 కోట్లతో 15 పనులు మంజూరు కావడం జరిగిందన్నారు. పంచాయతీ రాజ్‌శాఖపై సమీక్షిస్తూ మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద జిల్లాకు రూ.91.65 కోట్లతో సిసి రోడ్లు, బిటి రోడ్లు, కాంపౌండ్ వాల్స్ వంటి 1,598 పనులు మంజూరు కావడం జరిగిందని తెలిపారు. ఇందులో భాగంగా అంతర్గత సిసి రోడ్స్‌కు సంబంధించి రూ.24.24కోట్లతో 435 పనులు పూర్తి కాబడి 70 కి.మీల మేర రోడ్లుల నిర్మాణం పూర్తి అయిందన్నారు. సిసి అప్రోచ్ రోడ్ల నిర్మాణానికి సంబంధించి రూ.82 లక్షలతో 12 పనులను పూర్తి చేయడం జరిగిందన్నారు. సిసి రోడ్ల నిర్మాణాన్ని వేగవంతం చేసి వెంటనే బిల్లులను అప్‌లోడ్ చేయాలన్నారు. సిసి రోడ్‌లతో పాటు కాంపౌండ్ వాల్స్, అంగన్వాడీ, గ్రామ పంచాయతీ భవనాల నిర్మాణాల నిర్మాణాలను నాణ్యతా ప్రమాణాలతో వేగంగా పూర్తి చేయాలన్నారు. సిపిఓ సాంబ శివారెడ్డి, పిఆర్‌డీఈ చంద్రశేఖర్‌రెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్‌ఈ నరేంద్ర, చిత్తూరు మున్సిపల్ కమిషనర్ నరసింహ ప్రసాద్,కుప్పం పలమనేరు, పుంగనూరు, నగిరి మున్సిపల్ కమిషనర్లు పాల్గొన్నారు.

హార్టీకల్చర్ హబ్ జాతీయ సదస్సు


జాతీయ సదస్సు శిక్షణ కార్యక్రమానికి పాల్గొన్న ప్రతినిధులతో ఎమ్మెల్సీ

ప్రజాశక్తి- కుప్పంటౌన్: కుప్పం నియోజకవర్గంలో ఉద్యానవన పంటలను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతున్నట్లు టిడిపి కుప్పం నియోజకవర్గ సమన్వయ కమిటీ అధ్యక్షులు, ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ డాక్టర్ కంచర్ల శ్రీకాంత్ తెలిపారు. మంగళవారం స్థానిక ఆర్టికల్చర్ హబ్‌లో ఉద్యాన శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్సీ డాక్టర్ ముఖ్యఅతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్టికల్చర్ హబ్ లో జరుగుతున్న జాతీయ సదస్సుకు దేశంలో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రతినిధులకు స్వాగతం పలికారు. ఈ జాతీయ సదస్సులో భాగంగా మూడు రోజుల పాటు ఉద్యానవన పంటలపై శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు తెలిపారు. ఇజ్రాయిల్ దేశ ప్రతినిధుల సహకారంతో 2018లో రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కుప్పంలో హార్టికల్చర్ సెంటర్ ఏర్పాటు చేయడం జరిగిందని అన్నారు. రైతులకు శిక్షణ ఇచ్చి 22 రకాల కూరగాయలు, ఉద్యానవన పంటలను దిగుబడి చేసేలా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపడుతుందని తెలిపారు. ముఖ్యమంత్రి ఆదేశానుసారం రైతులు అధిక ఆదాయం పొందే విధంగా ప్రణాళికలు రూపొందించి అమలు పరచనున్నమన్నారు. కార్యక్రమంలో ఇజ్రాయిల్ దేశ ప్రతినిధులు, హార్టికల్చర్ అధికారులు, టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డాక్టర్ సురేష్ బాబు, టిడిపి నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎలిఫెంట్ హబ్ ఏర్పాటుకు చర్యలు


కర్ణాటకలో శిక్షణ పొందుతున్న అటవీ సిబ్బంది
సమీక్షిస్తున్న ఎమ్మెల్యే అమర్‌నాథ్ రెడ్డి

ప్రజాశక్తి- పలమనేరు: పలమనేరు కౌండిన్య అటవీ ప్రాంత గ్రామాలపై తరచూ జరుగుతున్న ఏనుగుల దాడులను అరికట్టే ఉద్దేశంతో స్థానిక ఎమ్మెల్యే అమర్నాథరెడ్డి ఈ ప్రాంతంలో ఎలిఫెంట్, టూరిజం హబ్ ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. పంట, ప్రాణ నష్టం వాటిల్లకుండా ఉండేందుకు అవకాశం ఉంటుందని కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక ఈ అంశంపై ప్రత్యేక దృష్టి సారించారు. పలమనేరు మండలంలోని ముసలమడుగు అటవీప్రాంతంలో ఎలిఫెంట్ హబ్ ఏర్పాటుకు అనుకూలమైన స్థలాన్ని ఇప్పటికే అధికారులు గుర్తించారు. అయితే ఈ ప్రాజెక్టు ఏర్పాటుకు అవసరమైన నిధులు సైతం అటవీశాఖ ఖాతాలో ఉండడంతో మొదటిసారి జరిగిన అసెంబ్లీ సమావేశాలలో ప్రాజెక్టుకు సంబంధించిన నివేదికను అటవీశాఖ మంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్‌కు స్థానిక ఎమ్మెల్యే అందించి విన్నవించారు. దీనిపై నాటి నుంచి నేటి వరకు ఎప్పటికప్పుడు సంబంధితశాఖ అధికారులతో ఆయన సమీక్ష నిర్వహిస్తూన్నారు. ఈ నేపథ్యంలో సోమవారం సైతం పలమనేరు ఎఫ్ఆర్ఓ నారాయణతో ఆయన పనుల పురోగతిపై సమీక్ష నిర్వహించారు. ఇప్పటికే రెండు వారాలుగా సుమారు 20 మందికి పైగా ఎలిఫెంట్ ట్రాకర్స్, అటవీ సిబ్బంది కర్ణాటక ప్రాంతంలో శిక్షణ పొందుతున్నారని, ప్రాజెక్టు సంబంధించిన డీటెయిల్డ్ ప్రాజెక్ట్ రిపోర్ట్ రూపొందించి ఉన్నతాధికారులకు సైతం పంపడం జరిగిందని ఎఫ్ఆర్వో ఎమ్మెల్యేకు వివరించారు. ఈ ప్రాజెక్టుల ప్రధానంగా మదపటేనుగులను కట్టడి చేసేందుకు క్రాల్ ఏర్పాటు, శిక్షణ పొందిన ఏనుగుల కొరకు ఎన్‌క్లోజర్, సిబ్బంది క్వార్టర్స్, డిస్పెన్సరీ ఏర్పాటుకు అంచనాలు సైతం సిద్ధం చేయడం జరిగిందన్నారు. వీలైనంత త్వరగా టూరిజం హబ్ ఏర్పాటయ్యేందుకు అవసరమైన చర్యలను చేపడుతున్నామని తెలియజేశారు. తక్కువ వ్యయంతో ప్రాజెక్టు పూర్తి కావాలనే పరిమితి పెట్టుకోక మంచి టూరిజం హబ్ ఏర్పాటయ్యేలా చొరవ చూపాలని నిధుల అంశంలో ఏదైనా ఇబ్బందులు ఉంటే ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఏదేమైనా త్వరలో పలమనేరు ప్రాంతం ఎలిఫెంట్, టూరిజం హబ్‌గా ఏర్పాటు అవుతుండడంపై స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

శేషజీవితం ప్రశాంతంగా గడపాలి

అడిషనల్ ఎస్పీ రాజశేఖర్ రాజు



ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: ఉద్యోగ విరమణ తరువాత శేష జీవితాన్ని ప్రశాంతంగా గడపాలని అడిషనల్ ఎస్పీ రాజశేఖర్‌రాజు అన్నారు. ఎస్‌బిలో ఎస్‌ఐగా పనిచేసి ఉద్యోగ విరమణ పొందిన వెంకటరమణను మంగళవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా అడిషనల్ ఎస్పీ రాజశేఖర్‌రాజు మాట్లాడుతూ దాదాపు 41సంవత్సరాలుగా అంకితభావంతో అందించిన సేవలను పోలీసుశాఖ ఎప్పటికీ గుర్తుంచుకుంటుందని పేర్కొన్నారు. పోలీసు డిపార్ట్మెంట్‌లో పనిచేయడం సవాళ్లతో కూడుకున్నదని, కుటుంబజీవితాన్ని త్యాగం చేసి నిబద్ధతతో విధులను నిర్వర్తించినందుకు పోలీసుశాఖ తరపున కతజ్ఞతలు తెలిపారు. విధుల్లో చేరిన కాలంలో వచ్చిన ప్రతికూల పరిస్థితులను ఎదుర్కొని, కుటుంబానికి దూరంగా ఉంటూ విధులు నిర్వహించడం మామూలు విషయం కాదన్నారు. పదవీ విరమణ అనంతరం కుటుంబ సభ్యులతో సమయం గడుపుతూ ఆరోగ్యంపై దృష్టి పెట్టాలని సూచించారు.

గోకులం షెడ్ల నిర్మాణ పనులను వేగవంతం చేయండి

పశుసంవర్ధక శాఖ జాయింట్ డైరెక్టర్ ప్రభాకర్



ప్రజాశక్తి- ఐరాల: ఉపాధి హామీ పథకం ద్వారా మంజూరైన గోకులం షెడ్లల నిర్మాణ పనులను వేగవంతం చేయాలన్నారు. మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో ఏపీవోలతో గోకులం షెడ్ల నిర్మాణాల పనులపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జాయింట్ డైరెక్టర్ ప్రభాకర్ మాట్లాడుతూ గోకులం షెడ్ల నిర్మాణపనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించి పారదర్శకంగా నిర్మాణాలు చేపట్టే విధంగా పశుసంవర్తిక శాఖ, ఉపాధి సిబ్బంది సంయుక్తంగా పర్యవేక్షణ చర్యలు చేపట్టాలన్నారు. జనవరి 15వ తేదీ లోపు గోకులం షెడ్ల నిర్మాణాలను పూర్తి చేయాలన్నారు. గోకులం షెడ్లు నిర్మించేటప్పుడు ప్రభుత్వం ఇచ్చిన కొలతలతో నిర్మాణాలు మొదలుపెట్టాలని తెలిపారు. గోకులం షెడ్ల నిర్మాణాల్లో నాణ్యత ప్రమాణాలు పాటించే విధంగా, ఏపీవోలు పర్యవేక్షణ చేయాలన్నారు. గతంలో నిర్మించిన షెడ్లకు, పాతవాటికి బిల్లులు చెల్లించరాదన్నారు. గోకులం షెడ్లు మంజూరై ఇంకా పనులు మొదలుపెట్టిన రైతుల వద్దకు వెళ్లి వారికి అవగాహన కల్పించి వెంటనే పనులు ప్రారంభించే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. ఈకార్యక్రమంలో ఎంపీడీవో ధనలక్ష్మి, ఏపీ ఓ సంధ్యారాణి, ఉపాధి, వ్యవసాయ శాఖ, పశు సంవర్ధక శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

భువనేశ్వరికి ఉత్తమ ల్యాబ్ టెక్నీషియన్ అవార్డు



ప్రజాశక్తి- బంగారుపాళ్యం: విధులు నిర్వహించేటప్పుడు ఉత్తమ ప్రతిభ కనబరిచిన వారికి మంచి గుర్తింపు లభిస్తుందని డాక్టర్ శిరీష అన్నారు. మంగళవారం మండలంలోని ప్రజావైద్యశాలలో ఐసిటిసి ల్యాబ్ టెక్నీషియన్ భువనేశ్వరికి జిల్లా ఉత్తమ ల్యాబ్ టెక్నీషియన్‌గా అవార్డు రావడం పట్ల అభినందన సభ జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఏ వృత్తిలో అయినా ఉత్తమ ఫలితాలు సాధించాలంటే మనలో దాగి ఉన్న ప్రతిభను ప్రదర్శించాలని, ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు విధులు చేపట్టి పనులు పూర్తిచేసి గుర్తింపు పొందిన వారిని సత్కరించుకోవడం మనందరి బాధ్యత అన్నారు. అనంతరం భువనేశ్వరిని శాలువతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ విజయకుమారి, డాక్టర్ స్వరూప, డాక్టర్ అఖిల్, డాక్టర్ రాగ భావన, డాక్టర్ షాలిని, సిబ్బంది సుమతి భాయ్, పుష్పలత, ఐసిటిసి కౌన్సిలర్ బాబు, జయచంద్ర పాల్గొన్నారు.

చిన్నారులకు తల్లిపాలు శ్రేయస్కరం



ప్రజాశక్తి- యాదమరి: అప్పుడే పుట్టిన బిడ్డల నుండి 6 నెలల వయస్సు వరకు పిల్లలకు తల్లిపాలే శ్రేయస్కరమని అది తప్ప వేరే ఎలాంటి ఆహారం ఇవ్వరాదని యాదమరి వైద్యాధికారి డాక్టర్ అనిల్ కుమార్ నాయక్ స్పష్టం చేశారు. మంగళవారం యాదమరి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆశా కార్యకర్తల నెలవారీ సమావేశం జరిగింది. ఈసందర్భంగా వైద్యాధికారి మాట్లాడుతూ ఆరు నెలల లోపు చిన్నారులకు తల్లిపాలు తప్ప ఇతర ఆహారం ఏదీ పెట్టరాదని తెలిపారు. బాలింత పౌష్టికాహారం తీసుకోవడం ద్వారా ఆరు నెలలపాటు చిన్నారికి అవసరమయ్యే పోషకాలు అన్ని తల్లిపాలలోనే ఉంటుందని ఈ విషయం గర్భవతిలు, బాలింతలకు అవగాహన కల్పించాలని డాక్టర్ సూచించారు. అలాగే హెచ్ఐవి ఎయిడ్స్‌పై మాట్లాడుతూ గుర్తింపు లేని రక్తనిధుల నుండి రక్తం తీసుకొని మార్పిడి చేసుకోవడం ద్వారా, అక్రమ సంబంధాల ద్వారానే ఎయిడ్స్ వ్యాప్తి చెందుతున్నదని దీనిపై ప్రజలకు అవగాహన కల్పించడం ద్వారా ఎయిడ్స్ వ్యాప్తిని అరికట్టవచ్చని సూచించారు. సిహెచ్ఓ లక్ష్మీనారాయణ, సెల్వరాణి, లక్ష్మీపతి, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

కంప్యూటర్లు బహుకరణ



ప్రజాశక్తి- చౌడేపల్లి: యాక్ట్ సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు దశరథరెడ్డి స్థానిక ప్రభుత్వ కళాశాలకు కంప్యూటర్లను బహుకరించారు. మంగళవారం ఈ మేరకు కళాశాల ప్రిన్సిపల్ జయప్రకాష్‌కు రూ1.20లక్షలు విలువ చేసే నాలుగు కంప్యూటర్లను అందించారు. కళాశాలలో విద్యార్థులకు స్కిల్ డెవలప్మెంట్ కోర్సులు నేర్చుకునేందుకు ఈకంప్యూటర్లు ఉపయోగపడతాయని ప్రిన్సిపల్ విజయప్రకాష్ తెలిపారు. దాత దశరథరెడ్డికి కళాశాల అధ్యాపకులు విద్యార్థులు కృతజ్ఞతలు తెలియజేశారు.

వానలకు నేలకూలిన ఇంటి గోడ



ప్రజాశక్తి- చౌడేపల్లి: ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షానికి ఓ ఇంటి గోడ కూలింది. ఈ ప్రమాదంలో ఎలాంటి నష్టం వాటిల్లకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. మండల కేంద్రమైన చౌడేపల్లిలో గల టీచర్స్ కాలనీలో నారాయణమ్మ కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తోంది. తుఫాన్ ప్రభావంతో గత మూడు రోజులుగా కురుస్తున్న వర్షానికి నారాయణమ్మ ఇంటి గోడ కూలింది. ఆ సమయంలో గోడకింద ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పింది. గోడ నిర్మించుకోలేని స్థితిలో ఉన్న నారాయణమును ప్రభుత్వం ఆదుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

గిరిజనులకు దుప్పట్లు పంపిణీ

ప్రజాశక్తి- చౌడేపల్లి: మండలంలోని దిగువపల్లి పంచాయితీ నెట్టిబండ యానాదికాలనీలోని గిరిజనులకు దుప్పట్లను పంపిణీ చేశారు. చిత్తూరు జిల్లా గిరిజన శాఖ అధ్యక్షుడు మూర్తి మానవతా దృక్పథంతో తన సొంత నిధులతో కాలనీలోని 25 కుటుంబాల యానాదులకు తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకుడు బోయకొండ సుబ్బుచే దుప్పట్లు పంపిణీ చేశారు. యానాది సంఘం నాయకుడు కృష్ణయ్య, శ్రీనివాసులు, టిడిపి నాయకులు పాల్గొన్నారు.

డ్వాక్రా సంఘాల సర్వసభ్య సమావేశం

ప్రజాశక్తి -రొంపిచెర్ల : మండలం స్త్రీశక్తి భవనంలో మంగళవారం డ్వాక్రా మహిళల సర్వసభ్య సమావేశం జరిగింది. ఈసమావేశంలో కొత్తగా ఎన్నుకోబడిన సంఘమిత్రలకు ఎటువంటి ఆటంకాలు కలగకుండా వారిని కొనసాగించాలని, వారిని ఎన్నుకున్న విధానాన్ని గౌరవించాలని, కొత్త సంఘమిత్రులకు సహాయ సహకారాలు అందించాలని వెలుగు ఏపిఎం ఏ.హరినాథ్, సిసిలు బి.నాగరాజ, రమేష్ కోరారు. కొత్త సంఘమిత్రలు హారతి, లక్ష్మీ తులసి, విజయ, లావణ్య, బషీరున్, మంజుల, షర్మిల, సురేఖ, పద్మ, గౌతమి, రోజా, గాయత్రి, వసుంధర, సభ్యులు పాల్గొని వినతి పత్రం అందజేశారు.

విభిన్న ప్రతిభావంతుల విద్య, వైద్య, ఉపాధి కల్పనకు

జిల్లా యంత్రాంగం కృషి: అసిస్టెంట్ కలెక్టర్



ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: విభిన్న ప్రతిభావంతులకు విద్య, వైద్య, ఉపాధి కల్పనకు జిల్లా యంత్రాంగం కృషి చేస్తుందని అసిస్టెంట్ కలెక్టర్ హిమవంశీ పేర్కొన్నారు. మంగళవారం అంబేద్కర్ భవన్‌లో అంతర్జాతీయ విభిన్న ప్రతిభావంతుల దినోత్సవ వేడుకలు విభిన్న ప్రతిభావంతుల వృద్ధులు హిజ్రాల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా అసిస్టెంట్ కలెక్టర్ పాల్గొనగా వీరితో పాటు నగర మేయర్ అముద తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అసిస్టెంట్ కలెక్టర్ మాట్లాడుతూ విభిన్న ప్రతిభావంతుల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తున్నదని, జిల్లా యంత్రాంగం తరఫున విభిన్న ప్రతిభావంతుల విద్య, వైద్య, ఉపాధి కల్పనకు కృషి చేస్తామన్నారు. విభిన్న ప్రతిభావంతులు అందించిన సమస్యలను జిల్లా కలెక్టర్ వారికి నివేదించి పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. నూతనంగా నిర్మిస్తున్న ప్రభుత్వ భవనాలలో అంగవైకల్యంతో నడవలేని స్థితిలో ఉన్న వారి కోసం ర్యాంప్‌లు ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఆర్థికంగా అభివృద్ధి చెందడానికి అవసరమైన లోన్‌లు బ్యాంకుల ద్వారా అందించడం జరుగుతుందని తెలిపారు. విభిన్న ప్రతిభావంతులు అన్నీ రంగాలలో నైపుణ్యం కలిగి ఉండడంతో పాటు క్రీడారంగంలో సైతం రాణిస్తున్నారని, ఒలింపిక్స్‌లో ప్రతిభ కనపరచడం జరిగిందన్నారు. నగర మేయర్ మాట్లాడుతూ విభిన్న ప్రతిభావంతులు సామాజిక, ఆర్థిక అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తున్నారన్నారు. విభిన్న ప్రతిభావంతులు ఉన్నతమైన ఆలోచనలు కలిగి అన్నీ రంగాలలో రాణించాలన్నారు. ఈకార్యక్రమంలో భాగంగా విభిన్న ప్రతిభావంతుల 10 మందికి టచ్ ఫోన్‌లు, నలుగురికి హియరింగ్ ఎయిడ్‌లు ముఖ్యఅతిథుల చేతుల మీదుగా పంపిణీ చేయడం జరిగింది. కార్యక్రమంలో విభిన్న ప్రతిభావంతులు వృద్ధులు హిజ్రాల సంక్షేమశాఖ సహాయ సంచాలకులు ఏ.వై.శ్రీనివాస్, ఈడీ మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ హరినాధ రెడ్డి, జిల్లా స్త్రీ శిశు సంక్షేమ శాఖ అధికారి హైమావతి, అసోసియేషన్ లీడర్లు మురళి, చంద్రశేఖర్, పెద్దఎత్తున విభిన్న ప్రతిభావంతులు, తదితరులు పాల్గొన్నారు.

గంగవరం: స్థానిక ఉన్నత పాఠశాలలో మంగళవారం ప్రపంచ దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా దివ్యాంగులకు పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. ఈసందర్భంగా మండల విద్యాధికారి వేణుగోపాల్ రెడ్డి మాట్లాడుతూ సంఘవైకల్యం శరీరానికి కానీ దివ్యాంగులకు కాదన్నారు. ఈ సందర్భంగా బంగారుపాళ్యంకు చెందిన రిటైర్ట్ ఆర్మీ పి.వెంకటస్వామి 40 మంది విద్యార్థులకు బహుమతులు అందించి భోజన వసతులు కల్పించినందుకు ఆయన్ను అభినందించారు. భవిత కేంద్రం ఐఈఆర్ఎఫ్ సురేఖ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రతిభకు అంగవైకల్యం అడ్డురాదు : ఎంఈఓ

బంగారుపాళ్యం: ప్రతిభకు అంగవైకల్యం అడ్డురాదని మండల విద్యాశాఖ అధికారి నాగేశ్వరరావు అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని భవిత భవనంలో అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవ కార్యక్రమం సాహితవిద్య ఉపాధ్యాయురాలు హిమబిందు ఆధ్వర్యంలో జరిగింది. ఈ సందర్భంగా మండల విద్యాశాఖ అధికారి నాగేశ్వరరావు మాట్లాడుతూ ప్రతిభ కనపరిచేందుకు ఆంగవైకల్యమే అడ్డురాదని ప్రతి ఒక్కరిలోనూ ఏదో ఒక రక నైపుణ్యం ఉంటుందని అన్నారు. అనంతరం వివిధ పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు పంపిణీ చేశారు. చిత్తూరు జిల్లా ఏఎస్ఓ నరోత్తం నాగేశ్వరరావు, ఎంఈఓ 2 రమేష్ బాబు, ఉపాధ్యాయులు భార్గవ రామ్, అమ్ములు, మీరయ్య పాల్గొన్నారు.



ఎంఎస్ఎంఈ సర్వే ద్వారా నమోదు చేసుకోండి



అవగాహన కల్పిస్తున్న ఎంపీడీవో ధనలక్ష్మి

ప్రజాశక్తి-ఐరాల: కామినాయనిపల్లి గ్రామపంచాయతీ పరిధిలోని వైఎస్ గేట్‌లో సూక్ష్మ,చిన్న, మధ్య తరహా పరిశ్రమలను మంగళవారం ఎంఎస్ఎంఈ సర్వే సందర్భంగా ఐరాల ఎంపిడిఓ ధనలక్ష్మి పరిశీలించారు. స్థానిక ప్రజలకు ఎంఎస్ఎంఈ సర్వే గురించి అవగాహన కల్పిస్తూ ఈ సర్వే ద్వారా స్థానికంగా ఉన్న యూనిట్లను గుర్తించి వాటికి ఆర్థిక సాయం అందించి, మార్కెటింగ్ మెరుగుపరచి, ఉత్పత్తి సామర్థ్యాన్ని పెంచి తద్వారా నిరుద్యోగ యువతకు వ్యాపారం వైపు ఉపాధి అవకాశాలను మెరుగుపరచడానికి ఉపయోగ పడుతుందని తెలిపారు. కావున అందరు వ్యాపారస్తులు చిల్లర దుకాణా దారులు, పరిశ్రమ నిర్వాహకులు సర్వే సిబ్బందికి సహకరించి సమగ్ర సమాచారాన్ని ఇచ్చిగా ఖచ్చితంగా నమోదు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి శ్యామల, సచివాలయం సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

మలేరియా, డెంగీ వేర్వేరు పరీక్షలు చేయాలి

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: మలేరియా, డెంగీకి సంబంధించి వేరు వేరుగా పరీక్షలు నిర్వహించాలని జిల్లా మలేరియా అధికారి డాక్టర్ అనిల్ కుమార్ పేర్కొన్నారు. మంగళవారం జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ ఓ.ప్రభావతి దేవి ఆదేశాల మేరకు జిల్లా మలేరియా అధికారి డాక్టర్ అనిల్ కుమార్ ఆధ్వర్యంలో ఒక్కరోజు ల్యాబ్ టెక్నీషియన్లతో సమీక్ష సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా డాక్టర్ అనిల్ కుమార్ మాట్లాడుతూ అక్కడక్కడ మలేరియా, డెంగీ కేసులు రావడం జరుగుతుందని, రక్త పరీక్షలు విరివిగా చేపట్టాలన్నారు. క్షేత్రస్థాయిలో ఆర్‌డిటి కిట్లు ద్వారా రక్త పరీక్షలు నిర్వహించాలన్నారు. యాక్టివ్, పాసివ్ పరీక్షలను విరివిగా చేసి పాజిటివ్ నిర్ధారణ అయ్యితే వెంటనే చికిత్స ప్రారంభించాలని అన్నారు. ఆర్టిటి కిట్ల నందు డెంగీ పాజిటివ్ వస్తే ఎలిసా పరీక్షకు జిల్లా ఆసుపత్రికి పంపించి పరీక్షించి కన్ఫామ్ చేసి వెంటనే చికిత్స ప్రారంభించేటట్లు చూడాలన్నారు. తద్వారా డెంగీ మరణాలు లేకుండా చేయవచ్చునని తెలిపారు. ప్రతి కేసును ఐహెచ్ఐపి పోర్టల్‌లో నమోదు చేయాలన్నారు. దోమలు అభివృద్ధి చెందకుండా, దోమలు కుట్టకుండా తీసుకోవాల్సిన చర్యలపై ప్రజలకు అవగాహన కార్యక్రమాలను ఏఎన్ఎంలు, ఆశ వర్కర్లు పారామెడికల్ సిబ్బంది ద్వారా గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు.

చంద్రబాబు ప్రజలపై బాదుడు మానుకోవాలి

మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సునీల్ కుమార్

ప్రజాశక్తి- బంగారుపాళ్యం: ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రజలపై బాదుడు మానుకోవాలని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సునీల్ కుమార్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని జడ్పీ మాజీ ఛైర్మన్ కుమార్ రాజా స్వగృహంలో పత్రిక విలేకరుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఏర్పడి ఆరునెలల కాలంలో ప్రజలపై పెనుభారం మోపి బాదుడు కార్యక్రమాన్ని ప్రారంభించారని అన్నారు. పథకాలను అమలు చేసేందుకు ఏదో ఒకటి నూతన ఎత్తుగడలను ప్రదర్శిస్తున్నారని, రాష్ట్ర ప్రభుత్వం దాదాపు 15వేల కోట్ల రూపాయలు విద్యుత్‌ఛార్జీల ద్వారా వసూలు చేసేందుకు ప్రయత్నిస్తున్నదని దీన్ని తక్షణం ఆపాలని అన్నారు. ఆరు నెలలో 70 వేల కోట్ల రూపాయలు అప్పులు తెచ్చారు కానీ అభివృద్ధి శూన్యమని విమర్శించారు. నూతనంగా ట్రూ ఆఫ్ చార్జీలని అమలు చేసేందుకు ప్రయత్నిస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే లలిత కుమారి, జెడ్పి మాజీ ఛైర్మన్ కుమార్‌రాజా, మాజీ ఏఎంసీ ఛైర్మన్ దత్తురెడ్డి, సర్పంచులు శ్రీనివాసులు, సుబ్రహ్మణ్యం, మాజీ సర్పంచులు ప్రకాష్‌రెడ్డి, కృష్ణమూర్తి, కామరాజు, చంద్రశేఖర్ రెడ్డి, జగదీష్ పాల్గొన్నారు.



జలమయమైన ఇళ్లను పరిశీలించిన తహశీల్దార్



ప్రజాశక్తి - ఎస్ఆర్ పురం: మండలంలో ప్రస్తుతానికి కురుస్తున్న వానలకు ఇళ్లలోకి వర్షపు నీళ్ళు చేరాయి. ఇందుకు సంబంధించి గ్రామస్తులు రెవెన్యూ అధికారులకు తెలియజేయగా స్పందించిన ఎస్ఆర్ పురం తహశీల్దార్ సంఘటన స్థలానికి చేరుకున్నారు. సోమవారం రాత్రి భారీగా వర్షం కురిసింది. దీంతో మండలం డీకే మర్రిపల్లి గ్రామానికి చెందిన గుండమ్మ సురేంద్రబాబు, చిన్నక్క చిన్నబ్బా చెందిన ఇళ్లలోకి వర్షపు నీరు ఎక్కువగా చేరాయి. కుటుంబ అవసరాలకు ఉన్న నిత్యావసర వస్తువులన్నీ తడిసి ముద్దయ్యాయి విషయం తెలుసుకున్న తహశీల్దార్ వర్షపు నీటిని సహితం లెక్కచేయకుండా ఆనీళ్లలో వెళ్లి బాధితులను పరామర్శించారు. బాధితులకు ప్రభుత్వం ద్వారా అందవలసిన సాయాన్ని బాధితులకు అందిస్తామని హామీ ఇచ్చారు.

చెరువుల అక్రమాలకి పాల్పడే వాళ్లను మీరే నిలదీయాలి: తహశీల్దార్

చెరువులకు కాలువలు తూములు చెరువు కట్టలు ఉంటాయి. వీటిని కొంతమంది ఆక్రమించి తమ స్వార్థానికి వాడుకోవడం వల్ల గ్రామంలో నిజాయితీగా ఉన్న కుటుంబాలకు ఇబ్బందులు తప్పవు. పేదల పక్షాన ప్రభుత్వం అనేక ప్రభుత్వ పథకాలను తెచ్చి ఇళ్లస్థలాలు ఇచ్చి ఇల్లు కట్టుకునే దానికి రుణాలు కూడా ప్రభుత్వమే అందిస్తున్నాయి కానీ కొంతమంది తమ స్వార్థం కోసం చెరువులను కాలువలను చెరువు కట్టలను ఆక్రమించి ఇల్లు కట్టుకుంటే వర్షపు నీరు ఎటు వెళుతుంది. గ్రామస్తులే తమ గ్రామాలను కాపాడుకోవాలి. అక్రమాలకి పాల్పడే వాళ్లను నిలదీయాలి. మీ గ్రామాన్ని మీరే కాపాడుకోవాలన్నారు.

వర్షపు నీళ్లను అరికట్టడానికి స్పందించిన టిఎన్ఎస్ఎఫ్ పార్లమెంటరీ కార్యదర్శి నరేష్

గత నాలుగు రోజులుగా కురిసిన వర్షానికి చెరువు నుండి గ్రామం పై వర్షపు నీళ్ళు మంగళవారం ఉదయం 3 గంటల నుంచి ఉధృతంగా ప్రవహించడంతో పలు ఇండ్ల లలో నీళ్లు నిండిపోయాయి. ఆ వర్షపు నీళ్లను అరికట్టడానికి ఎర్రమట్టిన గుట్టగా పోసి నివారించారు. గ్రామస్తులు పలువురు అతన్ని అభినందించారు.



రైతులు పంట బీమా చేసుకోవాలి

ప్రజాశక్తి- గుడిపల్లి: మండలం పెద్ద బదనవాడ పరిధిలో పొలం పిలుస్తోంది కార్యక్రమం జరిగింది. రైతులు ఈ రబీ సీజన్‌కు సంబంధించిన వరి, వేరుశనగ, టమోట పంటలకు ప్రధాన మంత్రి ఫసల్ భీమా యోజన పథకం ద్వారా అమలు అవుతున్న పంట ఇన్సూరెన్స్‌ను సద్వినియోగం చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి నాగరాజు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకి ఈ రబీ సీజన్‌లో సాగుచేసే వరి, వేరుశనగ దిగుబడి ఆధారిత పంటల బీమా, టమోటకి వాతావరణ ఆధారిత పంట బీమా ఉందన్నారు. ఈ రబీ సీజన్‌లో వరి, వేరుశనగ, టమాట పంటలు వేసి, ఆ పంటల మీద పంట రుణాలు తీసుకొన్న రైతులు, వాళ్లు రుణాలు తీసుకున్న బ్యాంకుల ద్వారా ప్రీమియం చెల్లించాలని, పంట రుణాలు తీసుకొని రైతులు, కామన్ సర్వీస్ సెంటర్ల ద్వారా గాని, సచివాలయంలోని డిజిటల్ అసిస్టెంట్‌ల ద్వారా గాని భూమి 1బి, ఆధార్, బ్యాంక్ పాస్ బుక్, ఈ పంట నమోదు ధృవీకరణ పత్రం సమర్పించి ప్రీమియం చెల్లించవచ్చు అన్నారు. వరి పంటకు ఎకరాకు రూ.84లు, వేరుశనగకు ఎకరాకు రూ.60లు, టమోటా పంటకు ఎకరాకు రూ.1250లు ప్రీమియంను చెల్లించి దరఖాస్తు చేసుకోవాలన్నారు. పంట ఇన్సూరెన్స్ చేసుకున్న రైతులకు వేరుశనగ పంటకు ఎకరాకు రూ.30వేలు, వరి పంటకు ఎకరాకు రూ.42 వేలు, టమోటా పంటకి ఎకరాకు రూ.25 వేలు కవరేజ్ అవుతుందని, ఇందుకు రైతులు ఈ రబీ సీజన్‌లో ఈ పంట నమోదు చేసుకోవాలన్నారు. రైతులు డిసెంబర్ 31లోపు ఆన్లైన్లో బీమా నమోదు చేసుకోవాలని తెలిపారు. రైతులు పూర్తి వివరాలకు రైతు సేవా కేంద్రాల అధికారులను, మండల వ్యవసాయ, ఉద్యానవన అధికారులను సంప్రదించవచ్చు అని అర్హత ఉన్న, అవసరమైన రైతులందరూ కూడా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.



రైతులతో మాట్లాడుతున్న మండల వ్యవసాయ అధికారి నాగరాజు

వరి పంటకు నష్టం

ప్రజాశక్తి- గంగాధర నెల్లూరు

మండలంలోని ప్రస్తుతం తుఫాన్ ప్రభావంతో విస్తారంగా వానలుపడ్డాయి. దీంతో రైతు పండించిన పంటలపై ప్రమాదం చూపింది. ఈ నేపథ్యంలో గంగాధర నెల్లూరు మండలం తూగుండ్రం పంచాయతీ తూగుండ్రం గ్రామం కర్ణకర్ రెడ్డి తనకున్న వ్యవసాయ పంట పొలంలో సుమారు మూడు నెలల క్రితం ఒక ఎకరాలో వరి పంటను నాట్లు వేశాడు. పంట ఏపుగా పెరిగి మంచి దిగుబడి వస్తుందని ఆశించాడు. ప్రకృతి విపత్కర పరిస్థితుల్లో ప్రస్తుతం వానలు అధికం కావడంతో సోమవారం రాత్రి వరి పంట పూర్తిగా నేలమట్టం అయ్యింది రైతుకు చేతికి వచ్చే దశలో ఇలా పంట నష్టం కావడంతో ప్రభుత్వం ఆదుకోవాలని మంగళవారం ఆ రైతు కుటుంబం కోరారు.

నూతన పిఆర్‌టియు కార్యవర్గం ఎన్నిక





ప్రజాశక్తి- యాదమరి: మండలం టీచర్ యూనియన్ పిఆర్‌టియు నూతన కార్యక్రమంను రాష్ట్ర వైస్‌ప్రెసిడెంట్ కనకాచారి అధ్వర్యంలో ఏకగ్రీవంగా మంగళవారం ఎన్నుకున్నారు. యాదమరి మండలం అధ్యక్షులుగా ఎ.శివప్రసాద్, ప్రధాన కార్యదర్శిగా కె.మోహన్ కుమార్, గౌరవాధ్యక్షులుగా బి.సురేష్ రెడ్డి, జిల్లా కౌన్సిలర్లుగా ఆనంద పిళ్లై, హరికృష్ణ, వైస్ ప్రెసిడెంట్‌గా విశ్వనాథ్, మండల మహిళ ఉపాధ్యాయురాలు కాంచన, కార్యదర్శులుగా లత రమణి, సరసను ఎన్నుకున్నారు. ఎన్నికల పరిశీలకుగా జె.భాస్కరరెడ్డి వ్యవహరించారు. వి.ఆర్.మురళి బాబు, మురళి, జగనాథం, ఫాతిమా, అఖిలభాను, స్వర్ణలత పాల్గొన్నారు.

బురదమయమైన బడి దారి

ఇబ్బందులు పడుతున్న చిన్నారులు



ప్రజాశక్తి- గంగవరం: మండలంలోని గంద్రాజుపల్లి పంచాయతీ మర్రిమాకనపల్లి గ్రామంలో ప్రాథమిక పాఠశాల, అంగన్వాడీ కేంద్రం ఒకే చోట ఉన్నాయి. అయితే ఈ దారి పూర్తిగా పాడైపోవడంతో కొద్దిపాటి వర్షానికి ఆ దారిలో విద్యార్థులు వెళ్లడానికి ఇబ్బందులు పడుతున్నారు. చిన్నపిల్లలు బురదనీటి నుంచి పాఠశాలకు వెళుతూ ఒక్కోసారి ఆ బురదలో పడిపోవడంతో పుస్తకాలు, బట్టలు పాడైపోతున్నాయని, కనీసం ఈ దారిలో మట్టి పనులైనా చేయిస్తే బాగుంటుందని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి పాఠశాల దారిని బాగుచేయాలని గ్రామస్తులు చెబుతున్నారు.

గంగాధరనెల్లూరు ఇన్‌ఛార్జ్ సీఐగా శ్రీనివాసంతి



ప్రజాశక్తి-గంగాధర నెల్లూరు: గంగాధర నెల్లూరు ఇంచార్జ్ సర్కిల్ ఇన్స్పెక్టర్‌గా కె.శ్రీనివాసంతి మంగళవారం పదవీ బాధ్యతలు చేపట్టారు. చిత్తూరు జిల్లా ఎస్పీ మణికంఠ చందోలు ఆదేశాల మేరకు జిల్లా ట్రాఫిక్ రికార్డ్ బ్యూరో లో పనిచేస్తున్న శ్రీనివాసంతి బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజాప్రతినిధులు, అధికారులు, ప్రజల సహకారంతో శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేస్తామన్నారు. కాగా ఇక్కడ సీఐగా పనిచేస్తున్న లక్ష్మీనారాయణను విఆర్‌కు బదిలీ చేశారు.

దళిత కార్యకర్తకు అండగా టిడిపి నాయకులు



ప్రజాశక్తి- వెదురుకుప్పం: కార్వేటినగరం మండలంలోని ఆర్‌కేవివి పేట గ్రామపంచాయతీ ఇందిరాకాలనీలో వి.దామోదరం అనారోగ్యంతో బాధపడుతూ ఇటీవల రుయా ఆసుపత్రిలో చేరి వైద్యం పొందుతున్నాడు. ఆయనను ఆర్‌కేవిబి పేట తెలుగుదేశం పార్టీ క్రియాశీల నాయకుడు నాగభూషణం రెడ్డి, మండల ఎస్సీసెల్ ప్రధాన దళిత నాయకుడు చెంగల్ రాయులు, మండల యూత్ ఆర్గనైజేషన్ సెక్రటరీ ఢిల్లీ బాబు రెడ్డి, ముని పరామర్శించి ఆర్థిక సహాయాన్ని అందించారు. పార్టీకి సేవ చేసిన ఈయనను అన్ని విధాలా ఆదుకుంటామని తెలియజేశారు.

త్రో బాల్ పోటీలలో బంగారు పతకాన్ని సాధించిన అనన్య

ప్రజాశక్తి- సోమల

సోమల మండలం ఎస్ నడింపల్లి పంచాయతీ సూరయ్య గారి పల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న అనన్య రాష్ట్రస్థాయి త్రోబాల్ పోటీలలో విశేష ప్రతిభ కనపరిచి బంగారు పతకాన్ని సాధించినట్లు విద్యార్థిని తల్లిదండ్రులు చంద్రమోహన్, విమల తెలిపారు. తమ పాఠశాలకు చెందిన విద్యార్థిని గత నెల 30వ తేదీ పూతలపట్టు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరిగిన రాష్ట్రస్థాయిలో త్రో బాల్ పోటీలలో బంగారు పతకాన్ని సాధించడం పట్ల పాఠశాల ప్రధానోపాధ్యాయులు నిరంజన్ కుమార్ రెడ్డి వ్యాయామ ఉపాధ్యాయులు శివ పాఠశాల ఉపాధ్యాయ బృందం విద్యార్థిని విద్యార్థులు అభినందించారు.

జాతీయస్థాయి త్రో బాల్ పోటీలకు అయ్యప్ప చరణ్ తేజ్

జాతీయస్థాయి త్రో బాల్ పోటీలకు సోమల విద్యార్థి అయ్యప్ప చరణ్ తేజ్ ఎంపికైనట్లు సోమల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు హరనాథ్ తెలిపారు. గత నెల 29 నుండి 30 వ తేదీ వరకు రాష్ట్ర స్థాయి త్రో బాల్ పోటీలు జెడ్పిహెచ్ఎస్ పూతలపట్టు నందు జిల్లా స్కూలుగేమ్స్ ఆద్వర్యం లో అండర్ 14సం విభాగంలో బాల బాలికల ఎంపిక మరియు అంతర్ జిల్లాల పోటీలు జరిగాయి. ఈ పోటీలలో అత్యంత ప్రతిభ కనబరిచి చిత్తూరు జిల్లా జట్టు బాలుర విభాగం లో రాష్ట్ర స్థాయి లో ప్రథమస్థానం సాధించింది .బాలుర జట్టు ప్రథమ స్థానంలో నిలవడం లో సోమల ఉన్నత పాఠశాల విద్యార్థి పి.అయ్యప్ప చరణ్ తేజ్ 9 తరగతి ప్రధాన భూమిక పోషించాడు .ఈ క్రీడాకారుడి చక్కటి ప్రతిభ గుర్తించి రాష్ట్రస్థాయి సెలక్షన్ కమిటీ సభ్యులు రాష్ట్ర జట్టుకు ఎంపిక చేసారు .జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక అయి రాష్ట్ర జట్టుకు పాతినిధ్యం వహిస్తారని తెలిపారు. జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన ఈ విద్యార్థి త్వరలో ఢిల్లీ లో జరగబోయే జాతీయ స్థాయి త్రో బాల్ పోటీలలో పాల్గొంటారని పిడి కరుణానిధి తెలిపారు. వీరి ఎంపిక పట్ల ఉపాధ్యాయినీ ఉపాధ్యాయ బృందం హర్షం వ్యక్తం చేశారు.